# ప్రేమ గీతం

అ ప్రయత్నంగానే ఆ అమ్మాయి రెండు చేతులూ జోడించి పెదిమలు కదిలించింది. నమస్తే అంటోంది. కాని మాటలు పెగిలిరావటము లేదు. మందార పుష్పాల్లాగావున్నాయి ఆమె రెండు కళ్ళూను. మంచు బిందువులాగ ఆమె కనుకొలనుల్లో రెండు చుక్కలు బరువుగా అప్పటి కప్పుడు చేరుకున్నాయి. చేతిరుమాలతో అద్దుకుంది. క్షణంలో పెదిమలు వెడల్పుచేపి కళ్ళను బాగా విప్పడానికి ప్రయత్నం చేస్తోంది. మరుక్షణంలోనే కనుబొమ్మలు కలుసుకుంటున్నాయి. మొహమంతా కురిచబడిపోయింది. బుగ్గలు కందిపోయినాయి. ముక్కుదూలాలు కదులు తున్నాయి. పెదిమలు తడబడుతున్నాయి. నుదురుమీద తిలకం గట్టిగా అతుక్కుపోయింది. ఆమె కళ్ళల్లో ఆకర్షణతోపాటు ఆవేదన కూడ వుంది. ఇంతబాధగా అ స్త్రీమూర్తి అక్కడ నిలబడి నమస్తే అనటం యెందుకో అందరికీ తెలుసు. రమేశ్ చెప్పాడు. తన ప్రక్కనే నిలబడి అందర్నీ ఆహ్వానిస్తూ ఆశీర్వాదం పొందమని. అందువలనే భర్త ప్రక్కనే నిలబడి లోపలికి వస్తున్న ప్రతివ్యక్తిని బలవంతంగా తెచ్చుకుంటున్న చిరునవ్వుతో ఆహ్వానించాలని ప్రయత్నం చేస్తోంది. ఆమె నలుగుర్లో మెలిగిన మనిషిలాగా కనబడటంలేదు. చాలా ఎబ్బెట్టుగానూ బెరుకుగానూ నిలబడివుంది. ఆమె పేరేమిటో తెలియదు, ఆమె తన వ్యక్తిత్వాన్ని రమేశ్‌లోనే లీనం చేసుకుంది.

ఆమె పేరు మిసెస్ రమేశ్: అంతగా తనను భర్తకు అంకితం చేసు కుంది కాబట్టే యీనాడు యింతబాధ!

ఆరుబైట పార్టీ యేర్పాటుచేశారు. నల్లటి మబ్బులు తొంగి చూసి పోతున్నాయి. వచ్చిన వాళ్ళందరూ సీట్లకోసం అటూఇటూ కదులు తున్నారు. పరిచయస్తులు ఒకర్నొకరు బిగ్గరగా అడుగుతూ ఏవో మాట్లాడు కుంటున్నారు. అందరూ కూడా రమేశ్‌ను ఆశీర్వదించే వాళ్ళేకాని, ఆమెను ఆదరించేవాళ్ళుకాని, ఓదార్చేవాళ్ళూ కాని కన బడలేదు. ఇంతమంది గుడ్‌విషెస్ వింటుంటే అతనికి ఆనందం, ఉత్సాహం యెక్కువవుతున్నాయి కాని అర్ధాంగిని చూస్తుంటే మాత్రం నిరుత్సాహం. విచారం. ఆధైర్యం వచ్చి పడుతున్నాయి, మధ్యమధ్య ఆమె చెవి దగ్గర ఏదో చెపుతున్నాడు. వెంటనే ఆమె కళ్ళు తుడుచుకుని, ఉత్సాహంగా నవ్వాలని ప్రయత్నం చేస్తుంది కాని అది ఆట్టేసేపు వుండ టంలేదు.

రమేశ్ వెస్ట్ జర్మనీకి ఇంజనీరింగ్ చదువుకని వెళ్ళుతున్నాడు. 'సెండాఫ్' పార్టీచాలా పెద్ద యెత్తున ఏర్పాటు చేశారు. ఎంతోమంది స్నేహితులు బంధువులు వచ్చారు. స్వీట్స్ తీసుకోవటం మెదలు పెట్టారు. కొంతమందవుతే కేవలం అవితినటానికే వచ్చినందుకన్నట్లు ప్రవర్తిస్తున్నారు. మరికొంత మంది తమ బంధువుల్లో యెవరెవరు విదేశాలకు వెళ్ళింది ఏమేమి చదివిందీ చెప్పుతున్నారు. ఒకాయన మాత్రం యీసడింపుగా అనేశాడు. యిప్పటి రోజుల్లో ఫారెన్' వెళ్ళ టం యేం గొప్పలే అని. అందరితోపాటు రమేశ్ అతని భార్య కూడా కుర్చీల్లో కూర్చున్నారు. అతను ఏవో పదార్థాలు నోట్లో వేసుకుంటు న్నాడు. ఆమె మాత్రం మెదలకుండా కూర్చుంది. ఆమె ప్రవర్తన చూస్తుంటే రమేశ్‌కు కోపం. విసుగూ పుట్టుకొస్తున్నాయి.

ఎన్నో విధాల చెప్పాడు. వచ్చిన అతిథులను నవ్వు మొహంతో ఆహ్వానించాలని, రెండేళ్ళ పీరియడేం పెద్దదేమి కాదు. ఇట్టే గడిచి పోతుంది. నువ్వు యిక్కడ బెంగగా వున్నట్టు అసంతృప్తిగా వున్నట్టు కనబడితే, అక్కడికి వెళ్ళిన తర్వాత, తనకేమి తోచదని దానివలన వెళ్ళిన పని అంత తృప్తిగా సానుకూలం కాదని నచ్చచెప్పటానికి ప్రయత్నం చేశాడు. ఇవన్నీ చెపుతున్నప్పుడు మాత్రం ఆమె అన్నింటికీ సరే అన్నట్టు తలవూపింది, కాని తీరా పార్టీ సమయానికి ఆమె ఆవేదనను ఆపుకోలేకపోయింది. అతను చిరాకు పడటం కనిపిస్తోంది. ఆమె తీరులో మార్పు రావటంలేదు, ప్రక్క అడవాళ్ళు బలవంతం చేసినా, ఒక్కటీ తీసుకోవటంలేదు. బొమ్మలాగ కూర్చున్నది. అంతే ఎంత మంది ఎన్ని విధాల హాస్యంగా మాట్లాడి నవ్వినా, ఆమె మాత్రం నవ్వటంలేదు. నవ్వురావటంలేదు. నవ్వాలని ప్రయత్నమూ చెయ్యలేదు. అసలు వాళ్ళన్న మాటలు ఆమెకు వినిపిస్తేగా.

ఉరుములు మెరుపులు కూడా సాగినాయి. అంతా పైకి తలలెత్తి ఒక్కసారిగ చూశారు. గబ గబ ఆదరా బాదరాగా కొంత మంది లేచి నిలబడ్డారు. పడటం పడటమే పెద్ద చినుకు పడింది. చొక్కాల మీద కోట్లమీద పెద్ద పెద్ద ముద్రలు వేసినట్లు చినుకులు యింకి పోయినాయి. ఇట్టే రివ్వున గాలి వచ్చేసి, మేఘాల్ని చెల్లా చెదరు చేసినాయి. ఇది కురిసే వానకాదు అని మళ్ళీ అందరూ తమ తమ కుర్చీల్లో చతికిలబడ్డారు.

"అబ్బ! ఏం పట్టుదలమ్మా నీచేత ఒక్క స్వీటుకూడ తినిపించలేక పోయాను" అన్నది ఒకామె.

నీ మిసెస్ మేమెవ్వరం చెప్పినా వినటంలేదు. నువ్వేనాచెప్పు

నీమాటేనా వింటుందేమో!....' రమేశ్‌ను చూసి అన్నది ఒకామె చనువుగా.

"ఓ మూల వెళ్ళిపోతుంటే యిప్పుడేనా వినదేమిటి?" వెకిలిగా నవ్వుతూ ఇంకో ఆమె వ్యాఖ్యానించింది.

రమేశ్ అభిమానం బాగా దెబ్బతిన్నది. పైకి నవ్వు మొహం పెట్టినా. వాళ్ళన్న మాటలు ములుకుల్లాగా తగిలినాయి. తన భార్యను చూస్తుంటే చెడ్డ కోపం కూడా వస్తుంది. ఆమెకు దుఃఖము తెరలు తెరలుగావచ్చి అమాంతం పొంగి పొరలింది. ఉద్వేగాన్ని అణచుకుంటూ బరువుగా తలెత్తింది. లోపల్నుంచి తనను పిలుస్తున్నట్టు యిట్టే గమనించింది. చివాలున లేచి అక్కడినుంచి గబగబా లోపలికి వెళ్ళింది అంతా ఆశ్చర్యంగానూ. అదో విధమైన విడ్డూరంగానూ చూశారు. రమేశ్‌కు మాత్రం ఎంతో అవమానపడ్డట్టు బాధపడ్డాడు. వాళ్ళకు క్షమాపణ చెప్పుకుంటున్నట్లుగానూ, ప్రాధేయపడుతున్నట్లుగానూ మాటలు అంటున్నాడు. ఒక్క క్షణం ఒక్క యుగంలాగా వుంది. ఆమె లోపల్నుంచి రావడంలేదు. రమేశ్ తీవ్రంగా యింట్లోకే చూస్తున్నాడు. అతని సహనం అంతరించిపోతోంది. తాను అమాంతంవెళ్ళి ఆమెను తీసుకురావాలనుకుంటున్నాడు. పెదిమల్ని గట్టిగా పంటితో బిగించి. తాను కూర్చున్న కుర్చీని లేస్తూనే కొంచెం వెనక్కు జరిపాడు. ఇంతలోకి ఆమె లోపల్నుంచి చిరునవ్వులు చిలకరించుకుంటూ, వయ్యారంగా రానేవస్తోంది. రమేశ్ ఆమెను చూస్తూనే మొహం విప్పారింది. ఎంతో ఆశ్చర్యం వేసింది. ఇందుకు గామాలు లోపలికి వెళ్ళింది. అని సంతృప్తిపడ్డాడు. భార్యను చూస్తుంటే, యిందాకటినుంచీ జరిగినదంతా యిట్టే మరిచేపోయాడు. ఆమె అమాంతంవచ్చి కూర్చుంది. నలుగుర్నీ సరదాగా పలకరిస్తూ తానూ స్వీట్సు తింటోంది. భర్త చేతికి

ఒకటి అందిచ్చింది. అతను తెలతెలబోయాడు. వెస్ట్ జర్మనీని గురించి తన భర్త చదివే ఆటో మొబైల్ యింజనీరింగ్ కోర్స్‌ను గురించి ధారాళంగా చెప్పేస్తోంది. అతనికి యెంతో ధైర్యం వచ్చింది ఆమెను చూసి నలుగురు మెచ్చుకుంటుంటే. తాను ఉప్పొంగి పోతున్నాడు. ఇంత మార్పుకు కారణం ఏమిటా అని అక్కడ వున్న వాళ్ళు మొదట్లో అనుకున్నా. ఆమె ప్రవర్తన, చనువు మాటల ధోరణిలో ఆ విషయమే మరచిపోయారు. పార్టీ చాలా జయప్రదంగా ముగిసింది. అందరి ఆశీర్వచనాలు పొందారు. వచ్చిన నలుగురూ తృప్తిగా వెళ్ళిపోయారు.

'యీ పార్టీ యింత సక్సెస్‌ఫుల్‌గా కావటానికి నువ్వే కారణం... అయినా చెప్పవద్దూ మొదట్లో నిన్ను చూస్తుంటే నాకు చెడ్డ కోపం వచ్చింది. ఏమిటి అట్లా కళ్ళ నీళ్ళు పెట్టుకుని కూర్చున్నావు ఏమయిందీ '....విసుగ్గా అడిగాడు.

" మిమ్మల్ని విడిచి ఒక్క క్షణంకూడా వుండలేనండీ...." బేలగ ఆలాపించింది ప్రేమ గీతం.

"రెండేళ్ళు అవంగానే గిర్రున తిరిగిరాను? పోన్లే నాకు నచ్చినట్లుగా బిహేవ్‌చేశావ్ అంతేచాలు....చూడు....ఇటు చూడు...." అని ఆమె మొహాన్ని తన రెండు చేతుల్తోనూ గట్టిగా పట్టుకున్నాడు. నా ప్రెస్టేజి నిలబెట్టావు అంటూ దగ్గరకు లాక్కున్నాడు.

" ఇప్పుడు సంతోషంగా వుందా పోనీ...." అన్నాడు రమేశ్ నవ్వుతూ.

" ఆఁ " అంటూ తన వేళ్ళ సందునుంచి తీసి ఆ టెలిగ్రాంను భర్తకు అందించింది.

"…. వెస్ట్ జర్మనీ ట్రిప్ కాన్‌సెల్డ్ …. ఫర్దర్ ఇంటిమేషన్ ఫాలోస్ !…."

( ప్రజా ప్రభ — )